క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఆత్మకూరు: ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆర్డీఓ నాగజ్యోతి ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయన్నారు. క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గెలుపు, ఓటములను ఇరు జట్లు సమానంగా తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి మన్సూర్‌బాషా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు, అంజుమన్ అధ్యక్షుడు నూర్‌బేగ్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు రేడియం నూర్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

బరక సంజీవయ్యకు ప్రత్యేక పూజలు

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని రోళ్లపాడు వద్ద వెలసిన బరక సంజీవయ్య స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, పల్లకీ సేవ, హోమ కార్యక్రమాలు చేపట్టారు. అలాగే దాత భీమ్‌శెట్టి నరేష్ భక్తుల సౌకర్యార్థం ఆలయానికి ఉచిత బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ప్రతి నెలా అమావాస్య రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు అర్చకులు తెలిపారు.

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా విశేషంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని నీలిషికారిపేటలో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌ను టౌన్ సీఐ, పోలీసులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటు సారా సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

దాడి కేసులో ఏడుగురిపై కేసు

ప్యాపిలి: పట్టణంలోని కుంటగడ్డ వీధిలో నివాసం ఉంటున్న సుధారాణితో పాటు ఆమె కుటుంబ సభ్యులు పుల్లయ్య, శివయ్య, మాధవిపై దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. సుధారాణికి ఐదేళ్ల క్రితం గుంతకల్లు మండలం మిట్టమీద దంచెర్ల గ్రామానికి చెందిన కావలి సుధాకర్‌తో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మూడేళ్ల క్రితం సుధారాణి గుంతకల్లు పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సుధారాణి ఇంటికొచ్చిన సుధాకర్ తన బంధువులతో కలసి దాడికి పాల్పడ్డాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కావలి సుధాకర్, నెట్టికల్లు, సురేంద్ర, మురళి, కృష్ణ, భరత్, తేజపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

1 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్యాపిలి: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మే ఒకటో తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ. 25 వేలు, ద్వితయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15 వేలు, తృతీయ, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు వరుసగా రూ. 10 వేలు, రూ.7 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ప్రవేశ రుసుం రూ. 600 చెల్లించి తమ జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు.

సేంద్రియం..పుడమికి బలం!

- పశువుల ఎరువు పంటలకు మేలు
- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు
- నేలలో పెరగనున్న తేమ శాతం



ట్రాక్టర్‌లో పొలానికి తరలిస్తున్న పశువుల ఎరువు



పొలంలో ఎరువు చల్లుతున్న రైతు

నంద్యాల(అర్బన్): వ్యవసాయంలో పంట దిగుబడి అధికంగా తీయాలనే ఉద్దేశంతో రైతులు రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. ఫలితంగా చీడపీడలు ఆశించడం, సూక్ష్మపోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. మరోవైపు భూసారం దెబ్బతింటోంది. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో రెండు లక్షల హెక్టార్లకు పైగా వ్యవసాయ భూమి ఉంది. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు ఉండటంతో ఏటా ఆ భూముల్లో రెండు పంటలు పండిస్తారు. అయితే, చాలా మంది రైతులు అధిక దిగుబడుల కోసం ఎక్కువగా రసాయన ఎరువులు వాడుతారు. దీంతో పెట్టుబడి ఖర్చు పెరిగిపోవడంతో పాటు చివరలో ఆశించిన మేర దిగుబడి రాక నష్టాలపాలవుతున్నారు. మరో రెండునెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. దీంతో రైతులు వేసవి దుక్కులకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో ముందుగా పశువుల ఎరువు వేసి పొలం దున్నితే మేలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు

సేంద్రియ ఎరువులతో సాగు

పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది సేంద్రియ ఎరువులతో సమానం. దీన్ని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. ఒక ఎకరాకు నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

భూసారం పదిలం...

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో జల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది. సహజ సిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందే విధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

ఇలా దున్నాలి..

పొలాన్ని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగుచేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవి కాలంలో మెట్ట భూములను వానాకాలంలో సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందుకంటే వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.

పశువుల ఎరువుతో భూసారం పెంపు



పశువులు, మేకలు, గొర్రెల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందే విధంగా సహాయపడతాయి. రైతులు తక్కు, ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

–ప్రసాదరావు, ఏఓ, నంద్యాల

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని పలు హోటళ్లలో ఆదివారం ఆహార కల్తీ నియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్‌తో పాటు కేంద్ర ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ మిశ్రా కలిసి గుత్తిరోడ్డులోని పిస్తా హోటల్, ఓటీజీ హోటల్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు ఆహార పదార్థాలు ఉన్నాయా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అని పరిశీలించారు. ఆయా హోటళ్లలో కిచెన్‌రూమ్, స్టోరేజీ రూమ్, డైనింగ్ హాల్, ఆహార తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాల్లో కాలపరిమితి తీరినవి ఉన్నాయేమోనని చూశారు. హోటల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నారా, వంట చేసేవారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. తాగునీటిని పరిశీలించి సంతృప్తి చెందారు. జీఎస్టీ చెల్లిస్తున్నారా, ఫుడ్ లైసెన్స్ తీసుకున్నారా అని పరిశీలించారు. హోటల్‌లకు వచ్చిన వినియోగదారుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయా హోటళ్లకు సంబంధించి రేటింగ్ ఇచ్చేందుకు తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

విద్యను ప్రైవేటీకరించేలా ప్రభుత్వం కుట్ర

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు విద్యను ప్రైవేటుపరం చేసి వ్యాపారంగా మారుస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ విమర్శించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరుగుతున్న జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్యా వ్యవస్థను పరిరక్షించుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలన్నారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే అవకాశం ఉందన్నారు.

నోటుపుస్తకాలు వచ్చాయ్



నోటుపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

దొర్నిపాడు: మండలంలోని హైస్కూళ్లకు 2025–26 విద్యా సంవత్సరానికి 13,428 నోటు పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు చెప్పారు. స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో నోటు పుస్తకాలను భద్రపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలిసారిగా విద్యార్థులకు నోటు పుస్తకాలను జగనన్న విద్యాకానుక ద్వారా అందజేస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శివకుమార్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు కూచిపూడి పరీక్షలు



చిన్నారులకు కూచిపూడి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రంలో చిన్నారులకు కూచిపూడి పరీక్షలు నిర్వహించారు. నాట్య గురువు డాక్టర్ పల్లెంశెట్టి సురేష్, ఎగ్జామినర్ డాక్టర్ బత్తుల సంజీవరాయుడు అధ్వర్యంలో సంవత్సరం పాటు నేర్చుకున్న విద్యార్థులకు వివిధ తరగతులలో పరీక్షలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా 6 సంవత్సరాలు నుంచి విద్యార్దులకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వారి సహకారంతో పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు కూచిపూడి అడుగులు, ముద్రలు, శ్లోకాలు, జతులు, అన్నమయ్య కీర్తనలు, జతిశ్వరం ప్రదర్శించారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి



మౌల్వీ షేక్ ఖతీబ్ అబ్దుల్ మజీద్ ఆరిఫ్



సాయిబాబానగర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజాచైతన్య కళావేదిక నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ప్రజాచైతన్య కళా వేదిక ఆధ్వర్యంలో నంద్యాలలో తిక్కస్వామి దర్గా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. భగత్‌సింగ్ గ్రంథాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ న్యాయవాది శంకయ్య మాట్లాడుతూ ఉగ్రదాడిలో పాకిస్తాన్ పాత్ర ఉందన్నారు. భవిష్యత్తులో ఉగ్రదాడులు జరగకుండా కేంద్రం పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రజా చైతన్య కళా వేదిక కార్యదర్శి చిన్న బాలహుసేని, రాముడు, నరసింహులు, ప్రకాష్, జమాల్, దావీద్, రుషి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసన

చాగలమర్రి: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ కన్వీనర్ మౌల్వీ షేక్ ఖతీబ్ అబ్దుల్ మజీద్ ఆరిఫ్ అన్నారు. ఆయన చాగలమర్రిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉగ్ర మూకలు అమాయక ప్రజల ప్రాణాలు బలిగొనడం బాధించిందన్నారు. దాడిలో పాల్గొన్న ముష్కరులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రదాడిలో అశువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రతి రోజు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్ ప్రధాని దాడులపై పూటకోమాట, రోజుకోమాట మాట్లాడటాన్ని ఆయన ఖండించారు.

జొన్న కొనుగోలుకు నమోదు తప్పనిసరి

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన మహీంద్ర రకం జొన్నలను మద్దతు ధరతో విక్రయించుకోవాలంటే తప్పని సరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా జొన్నలను రూ.3,371 ధరతో కొంటున్నట్లు చెప్పారు. మద్దతు ధరతో విక్రయించుకోవాలంటే ఆయా రైతు సేవా కేంద్రాల్లో తగిన ఆధార్, పొలం పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకుని వెళ్లాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

శిరివెళ్ల: ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు కథలు చెప్పడం, 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తకాలను చదవడం, (చదవడమంటే మా కిష్టం) , 10 నుండి 10.10 వరకు విరామం ఉంటుందన్నారు. 10.10 నుంచి 10.30 గంటల వరకు పుస్తక సమీక్ష, 10.30 గంటల నుంచి 11 వరకు కథలు చెప్పడం, 11 నుంచి 12 వరకు స్పోకన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, చెస్ క్యారమ్స్, క్విజ్, జీకే, ఇతర నైపుణ్య శిక్షణ ఉంటుందన్నారు.

ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: కలెక్టర్ ఆదేశించినా రామసముద్రం మజారా గ్రామమైన కొత్తసిద్దేశ్వరం గ్రామాన్ని సందర్శించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొత్తసిద్దేశ్వరం గ్రామాన్ని సందర్శించి చెంచులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్తసిద్దేశ్వరంలో చెంచులు నివశించేందుకు పక్కాగృహాలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం లేవని, దీనిపై నాలుగు నెలల క్రితం ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమ పరిధిలో లేదని బదులిచ్చారన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లగా కొత్తసిద్దేశ్వరంలో చెంచులను ఐటీడీఏలో చేర్చి, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, వారిపై చర్యలు తీసుకొని గ్రామంలోని చెంచులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

డాక్టర్ రవికృష్ణ సేవలు ప్రశంసనీయం



డాక్టర్ రవికృష్ణను సత్కరిస్తున్న ఐఎంఏ నంద్యాల వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర స్థాయిలో కందుకూరి రంగ స్థల పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణను ఐఎంఏ వైద్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. మధుమణి నర్సింగ్ హోమ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ డాక్టర్ రవికృష్ణ దర్శకత్వంలో కళారాధన సంస్థ ద్వారా సామాజిక చైతన్యం కలిగించే సాంఘిక నాటకాలు, పద్య పౌరాణిక నాటకాలు, బాలలలో సామాజిక స్పృహ పెంచడానికి బాలల నాటికలు అనేకం రూపొందించి ప్రదర్శించడం జరిగిందన్నారు. నంద్యాల కళా వైభవాన్ని దేశ వ్యాప్తంగా తీసుకెళ్లడం జరిగిందన్నారు. 2017లో ఉగాది పురస్కారం, 2018లో కళా రత్న హంస పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కందుకూరి రంగస్థల రాష్ట్ర స్థాయి పురస్కారం అందించడం గర్వకారణం అన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ కళారాధన సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవాన్ని ఏడాది పాటు నిర్వహించదలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ వసుధారాణి, డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బచ్చు సత్యనారాయణ, డాక్టర్ ఓబులరెడ్డి, డాక్టర్ నాగమణి, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

ఆలయానికి బియ్యం వితరణ



శ్రీ కాళీమాత సేవా సమాజ్ సభ్యులకు బియ్యం అందజేస్తున్న వాసవీ జాగృతి క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల వాసవీ జాగృతి క్లబ్ నవనంది, వాసవీ జాగృతి క్లబ్ పొట్టి శ్రీరాములు క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ కాళీమాత సేవా సమితి సభ్యులకు బియ్యం వితరణ చేశారు. గవర్నర్ బింగుమల శ్యామ్‌సుందర్ గుప్తా ఆధ్వర్యంలో అందజేశారు. ప్రతి అమావాస్యకు ఏదైనా సేవా సంస్థలకు బియ్యం అందించాలని నిర్ణయించడంతో ఈసారి కాళికాంబ దేవస్థానం నందు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రెండు క్లబ్‌ల సభ్యులు గుప్పెడు బియ్యం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బియ్యం సేకరించి ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీ కాళీ మాత సేవా సమాజ్ సభ్యులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో అరవేటి వాసు, విజయ కుమార్, నాగరాజు, ధనుంజయ, నవనంది క్లబ్ అధ్యక్షుడు కూరాకు శ్రీనివాసు, దత్తాత్రేయ రవితేజ, తాళ్లూరి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపోలో అక్రమాలపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): ఐఎంఎల్ డిపోలో అక్రమంగా జరిగిన నియామకాలపై విచారణ జరపాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్, ఐఎఫ్‌టీయూ కోశాధికారి చౌడప్ప, పీడీఎస్‌యూ నాయకులు రాంబాబు పేర్కొన్నారు. బేవరేజెస్ హమాలీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించమన్నారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మామూళ్లు తీసుకొని హమాలీలను చేర్పిస్తే మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఐఎంఎల్ డిపోలో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. ఈ అంశంపై తాము ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, నాయకులు కరీం, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



అందాల తెల్ల కలువ..

బైరవాణి చెరువులో తెల్లకలువలు

మహానంది: కలువ పూలంటే అందరికీ ఇష్టమే. ఎర్రటి, తెల్లటి కలువలు కొలనుల్లో కనువిందు చేస్తుంటాయి. సాధారణంగా ఎర్రటి కలువలు ఎక్కువగా కనిపిస్తాయి. గోపవరంలోని బైరవాణి చెరువులో తెల్ల కలువ పూలు చెరువు నిండా వికసించాయి. గ్రామస్తులు తీసుకెళ్లి పూజల్లో వినియోగిస్తున్నారు.

మహానందిలో సండే సందడి



చిన్న కోనేరులో భక్తుల కోలాహలం

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పాఠశాలలకు సెలవులు ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు శ్రీ కోదండ రాములు, ఆంజనేయస్వామి, వినాయకనందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. భక్తులరద్దీ పెరగడంతో ఆలయ అధికారులు నిరంతర దర్శనం ఏర్పాటు చేశారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం..

శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లకు ఆదివారం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి వేదయుక్తంగా కల్యాణ క్రతువును ముగించారు. భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్‌కూ వేసవి తాపం!

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న విద్యుత్ అధికారులు
- లోడు ఎక్కువైతే వైర్లు కాలిపోయే ప్రమాదం
- గృహోపకరణాలకు షార్ట్‌సర్క్యూట్ ముప్పు
- విద్యుత్ లోపాలపై సిబ్బందికి ఫిర్యాదు చేయాలి
- నాణ్యమైన వైరింగ్ ప్రమాణాలతోనే ప్రమాదాల నివారణ



గోస్పాడులో ఏర్పాటైన విద్యుత్ సబ్‌స్టేషన్

గోస్పాడు: ఎండలు ముదురుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 నుంచి 43డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు విద్యుత్ వినియోగం పెంచుతున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా విద్యుత్ వైర్ల సామర్థ్యంపైన సందేహాలన్నీ. కన్సీల్డ్ వైరింగా.. గోడలపైనే గొట్టాల్లో వైరింగ్ ఏర్పాటు చేశారా.. సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న వైర్లు వేశారా.. లేదా అనేది ముందుగా చూసుకోవాల్సి ఉంది. ఏమైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని గుర్తించాలి. ఎందుకంటే రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

అధికలోడుతో అనర్థమే

మండలంలో మొత్తం 8,491 కనెక్షన్లు ఉండగా వాటిలో కేటగిరి 1 కింద 7,003, కేటగిరి 2 కింద 347, కేటగిరి 3 కింద 356, కేటగిరి 4 కింద 17, కేటగిరి 5 కింద 768 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వేసవి కాలంలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో, కార్యాలయాల్లో కాని వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడును నిర్ధారించుకుని ఆమేరకు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. ఎవరైనా వినియోగదారుడు కేవలం ఒక కేవీ లోడుకు అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. వినియోగదారులందరూ వాడుతున్న లోడుకు అనుగుణంగా అనుమతి పొందితే భవిష్యత్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవికాలం ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాల్లో ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.
- విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామాగ్రిని మాత్రమే ఉపయోగించాలి.
- ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్ శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
- అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలి.
- నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వైరింగ్ మరింత పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.
- గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడ నంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు. అవసరమైన ప్రదేశంలో నీరు, ఉప్పు ఉపయోగించాలి.
- విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా ఉండేలా చూసు కోవాలి.

అప్రమత్తత అవసరం



వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్ చేయించుకోవాలి. ఎటువంటి సమస్యలు ఉన్నా విద్యుత్ సిబ్బందికి తెలియజేసి పరిష్కరించుకోవాలి.

– జ్ఞాన సూర్యుడు, విద్యుత్ ఏఈ, గోస్పాడు

ఇలా చేయకూడదు..

- గృహాల్లో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ విద్యుత్ భారం పడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదముంది.
- ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశముంది.
- ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్తులో తీగలపై ఉన్న రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.
- ఇంటిలో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నీ ఆన్‌చేసి ఉంచరాదు.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలు చిందర వందరగా ఉండరాదు.
- రక్షణ పరికరాలైన ఎంసీబీ (మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.